జోన్-2కు అధికారులు కావలెను

ఇన్‌చార్జిలతో కుంటుపడుతున్న పాలన

సచివాలయ సిబ్బందితో మమ ■ పేరుకుపోతున్న సమస్యలు

పట్టించుకోని పాలకులు ■ ప్రజల అవస్థలు



మధురవాడలోని జీవీఎంసీ జోనల్ ఆఫీసు

మధురవాడ: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో జీవీఎంసీ మధురవాడ జోన్ ముఖ్యమైనది. ఈ జోన్‌లో జీవీఎంసీ 5వ వార్డు నుంచి 13వ వార్డు వరకు మొత్తం 9 వార్డులు, లక్షన్నర వరకు జనాభా ఉంది. విస్తారమైన జోన్‌కు పరిపాలనా కేంద్రం మధురవాడ జోనల్ ఆఫీస్. ఇక్కడ ప్రజలకు సేవలు అందించాల్సిన వివిధ విభాగాలకు ప్రభుత్వం పూర్తి స్థాయి అధికారులను నియమించక పోవడంతో ఇన్‌చార్జిలతోనే పాలన కొనసాగుతోంది. దీంతో ఎక్కడి సమస్య అక్కడే అన్నట్లు ఉంది. అసలు ప్రధాన కార్యాలయానికే కమిషనర్ లేరంటే.. ఇతర విభాగాలు, జోన్‌ల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది అన్నట్లే ఉంది పరిస్థితి.



మధురవాడలో పారిశుధ్య పరిస్థితి ఇదీ..

జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో వెటర్నరీ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న కిశోర్‌కు మధురవాడ జోన్ వైద్యాధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి కొనసాగుతోంది. 6వ వార్డుకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేరు. బీడీఆర్ మరియు మలేరియా విభాగాలకు ఒక్కరే ఉన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ విభాగానికి అధికారులు ఉన్నారా.. లేరా అన్నది కూడా ఎవరికీ తెలియని పరిస్థితి. దీంతో పరిస్థితి ఎలా ఉంటుందనడానికి పక్కన చిత్రమే నిదర్శనం.

ఇంజినీరింగ్ విభాగం

విద్యుత్, ఇంజినీరింగ్ వర్క్స్, తాగునీరు వంటి విభాగాలు అన్నింటినీ ఒక్కరికే బాధ్యతలు అప్పగించేశారు. వీధిలైట్లు ఏడాది నుంచి చాలాచోట్ల పని చేయడం లేదు. ఫిర్యాదు చేసినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఈ విభాగం గురించే ప్రజలు మరిచిపోయే పరిస్థితి.

● వర్క్స్ విభాగం అయితే గత ప్రభుత్వం హయాంలో మంజూరు చేసిన పనులే చాలావరకు పూర్తి చేయలేని దుస్థితి.


మారికవలస తిమ్మాపురం రోడ్డులో అక్కడక్కడ మాత్రమే వెలుగుతున్న వీధిదీపాలు

కార్యదర్శులతో మమ అనిపిస్తూ..

జోనల్ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, విద్యుత్, ఇంజినీరింగ్ వర్క్స్, తాగునీటి విభాగం, ప్రజారోగ్యం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మలేరియా, జనన మరణాలు విభాగం, యూసీడీ వంటివి ఉన్నాయి. ఇందులో అత్యధిక విభాగాలకు పూర్తి స్థాయి అధికారులు లేక ఇన్‌చార్జిలతో పరిపాలన సాగిస్తున్నారు. అదీ సచివాలయ కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించి మమ అనిపిస్తున్నారు. దీంతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న పీజీఆర్‌ఎస్‌లో ఇచ్చిన ఫిర్యాదులు కూడా పరిష్కారానికి నోచుకోక, కొన్ని బుట్టదాఖలు అవుతుంటే మరి కొన్నింటిని అధికారులు అష్టకష్టాలు పడి క్లోజ్ చేసేస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే సచివాలయాల మీద పర్యవేక్షణ పనులు కూడా ప్రత్యేక అధికారులు చేయలేకపోతున్నారు.


పీజీఆర్‌ఎస్‌లో అందుబాటులో ఉంటున్న కొద్దిమంది అధికారులు, ఇన్‌చార్జి బాధ్యతలు చూస్తున్న కార్యదర్శులు

రెవెన్యూ

ఈ విభాగానికి పూర్తి స్థాయి రెవెన్యూ అధికారి లేరు. ఇక్కడి ఆర్వోను ఏడాది క్రితం ఆర్‌ఐలపై సక్రమంగా పర్యవేక్షణ చేయకపోవడంతో బదిలీ చేసి, గాజువాక జోన్‌లో బాధ్యతలు నిర్వహిస్తున్న రామనారాయణకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన వారానికి ఒక్కసారి కాదు కదా, కనీసం పీజీఆర్‌ఎస్‌కి కూడా హాజరు కావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. పైగా భౌగోళికంగా చూసినా గాజువాక-మధురవాడల మధ్య దూరం 40కిలో మీటర్లు. ఆయన గాజువాక నుంచి బయల్దేరి మధురవాడ రావడానికే రెండు గంటల పైన సమయం పడుతుంది. మరో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌దీ ఇదే దారి. గతంలోనూ అదనపు బాధ్యతలు అప్పగించినా.. పక్కనే ఉన్న జోన్ వారికి ఇచ్చేవారు. వారు రెండు చోట్ల పర్యవేక్షణ చేసేందుకు అవకాశం ఉండేది. కానీ, ఏ ఉద్యోగికి అయినా ఇంత దూరంలో ఉన్న రెండు చోట్ల విధుల నిర్వహణ ఎలా సాధ్యమో పాలకులే సెలవివ్వాలి.

టౌన్‌ప్లానింగ్

ఈ డిపార్ట్‌మెంట్‌లో కనీసం వార్డుకు ఒక బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్, చైన్‌మన్, వారిపై రెండు మూడు వార్డులకు కలిపి టీపీఎస్‌లు, వారిపై పర్యవేక్షణకు టీపీవో తర్వాత ఏసీపీలు ఉండేవారు. ప్రస్తుతం ఏసీపీ, టీపీవో తప్ప కనీసం బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ కూడా లేరు. ఈ బాధ్యతలను సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలకు అప్పగించారు. దీంతో ప్లానింగ్ సెక్రటరీలు ఆడిందే ఆట ..పాడిందే పాట అన్నట్లు ఉంది. అనధికార నిర్మాణాలు పుట్ట గొడుగుల్లా పెరిగిపోయి ప్రభుత్వానికి రావలసిన కోట్లాది రూపాయల ఆదాయానికి గండి కొడుతున్నారు. పైగా ప్రణాళికాబద్ధంగా సాగాల్సిన నిర్మాణాలు ఇష్టానుసారం జరుతున్నాయి.


బోరవానిపాలెంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం

అధికారులు లేని చోట సచివాలయ కార్యదర్శులకు ఆ బాధ్యతలు అప్పగించి పనులు చేయిస్తున్నాం. పూర్తి స్థాయి అధికారుల నియామకం విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం. – కొట్యాడ కనక మహాలక్ష్మి, జోనల్ కమిషనర్



క్లుప్తంగా

ప్రతి విద్యార్థిని శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నిర్మల

కొమ్మాది: చదువుతున్న ప్రతి విద్యార్థిని తమ మొబైల్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎండాడ మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ నిర్మల సూచించారు. రుషికొండలోని గాయత్రి విద్యా పరిషత్‌లో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో ఆమె పాల్గొని, ప్రసంగించారు. విద్యార్థినులతో పాటు మహిళలు ప్రతి ఒక్కరూ ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. వీరి భద్రత కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వాట్సాప్ మొబైల్ నెంబరు 7993485111ను సేవ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

8వ వార్డులో జెడ్సీ పర్యటన


వార్డులో పర్యటిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో జోన్-2 జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి పర్యటించారు. ఎండాడ వరాహగిరి నగర్‌లో గ్రీన్ బెల్ట్‌ను ఆక్రమిస్తున్నారని అందిన ఫిర్యాదు మేరకు ఆమె ఇక్కడ పరిశీలించారు. ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదే విధంగా వైఎల్‌పీ లేఅవుట్, రాజీవ్‌నగర్ కాలనీ, ముబారక్ కాలనీలను కలుపుతూ మాస్టర్ ప్లాన్ రోడ్డు ఏర్పాటుపై ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో ఏసీపీ తిరుపతిరావు, స్థానిక నాయకులు లొడగల రామ్మోహన్, సారపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జూలై 14 నుంచి ‘గీతం’ దూరవిద్య పరీక్షలు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీవోఈ) ద్వారా వివిధ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు ఈ ఏడాది జూలై 14వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖర్ తెలిపారు. దీనికి సంబంధించి జూన్ 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లేట్ ఫీజు రూ. 1500 చెల్లించి జూన్ 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం దొండపర్తిలోని గీతం సిటీ సెంటర్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

చినుకు పడితే చిత్తడి


చిన్న వర్షానికే బురదమయం అయిన హౌసింగ్‌బోర్డ్ కాలనీ రోడ్డు

పీఎం పాలెం: వర్షానికి పీఎం పాలెంలోని రహదారులు చిత్తడిగా మారాయి. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో పోస్టాఫీస్‌కు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డులో భారీ గోతులు ఏర్పడటంతో చిన్న వర్షానికే గోతుల్లో నీరు చేరి, బురదగా మారుతోంది. ఆ రోడ్డులో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఏర్పడిన గతుకులను పూడ్చి రోడ్డును పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

‘రుషికొండ బీచ్ నిర్వహణ అధ్వానం’

కొమ్మాది: కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రుషికొండ బీచ్‌ను బ్లూ ఫ్లాగ్ బీచ్‌గా అందించిందని, కానీ దానిని పరిశుభ్రంగా ఉంచడంలో నిర్వాహకులు, సిబ్బంది విఫలమయ్యారని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్రరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పర్యాటక ప్రాంతంగా అపారమైన అవకాశాలు ఉన్నప్పటికీ, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రతీరోజు బీచ్‌ను శుభ్రం చేయాల్సిన సిబ్బంది, పర్యవేక్షిస్తున్న అధికారులూ పట్టించుకోవడం లేదన్నారు. నాలుగు నెలలుగా జీవీఎంసీకి కమిషనర్ లేక కలెక్టర్‌పై పనిభారం పడుతోందన్నారు. ప్రభుత్వం తక్షణమే జీవీఎంసీ కమిషనర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. జూన్ 21న యోగా దినోత్సవానికి ప్రధాని మోదీ విశాఖ వస్తున్నందున, పరిశుభ్ర విశాఖ నుంచి స్వాగతించుదామన్నారు.

తీరం కోతకు గురవకుండా..

సిమెంట్ దిమ్మల ఏర్పాటు


తీరం వద్ద గట్టు కోతకు గురికాకుండా ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మలు


బీచ్‌రోడ్డులో కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జోన్-1 జెడ్సీ అయ్యప్పనాయుడు

భీమునిపట్నం: భీమిలి బోయివీధి సమీపంలో బీచ్‌రోడ్డు గట్టు కోతకు గురవకుండా అధికారులు బుధవారం చర్యలు చేపట్టారు. ఇక్కడ బీచ్‌పార్కు పక్కనుంచి బోయివీధివరకు అలల తాకిడికి తీరం చాలా రోజులుగా కోతకు గురవుతూ వస్తోంది. వర్షాలు, తుపానులు వచ్చే సమయాల్లో అలల ఉధృతి ఎక్కువగా ఉండడంతో ఈ మేరకు బాగా కోతకు గురవుతోంది. ఇప్పుడు మళ్లీ ఎక్కువగా కోతకు గురవుతోందన్న విషయం తెలుసుకున్న జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు కోతకు గురైన గట్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీరం కోతను అడ్డుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా ప్రస్తుతం కోతకు గురవుతున్న తీరంలో సిమెంట్ దిమ్మలను ఏర్పాటు చేస్తున్నామని, తద్వారా అవి అలలను అడ్డుకోవడంతో కోతకు గురవకుండా ఆగుతుందని తెలిపారు. తదుపరి ఈ సమస్య శాశ్వత పరిష్కారం కోసం పటిష్టమైన రక్షణ గోడను నిర్మించవలసి ఉందని, ఇందుకోసం తగినమేరకు అంచనాలను రూపొందించి అధికారులకు పంపిస్తామన్నారు. త్వరలో గోడ నిర్మాణం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఆయన వెంట పబ్లిక్ వర్క్స్ ఏఈ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించకుండా అర్జీ క్లోజ్ చేస్తే చర్యలు

జెడ్సీ కనక మహాలక్ష్మి


ప్లానింగ్ సెక్రటరీలను ఉద్దేశించి మాట్లాడుతున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

మధురవాడ: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్‌ఎస్‌లో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా వస్తున్నాయని జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి అన్నారు. పైగా ఆ సమస్యలు పరిష్కారం కాకుండానే ప్లానింగ్ సెక్రటరీలు క్లోజ్ చేసేస్తున్నట్లు కూడా ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆ శాఖ అధికారులకు సూచించారు. బుధవారం నిర్వహించిన పట్టణ ప్రణాళిక విభాగం సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణ విషయాల్లో ఏమరుపాటు వద్దని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన సమస్యలు 15రోజుల్లో పరిష్కారం చేసి క్లోజ్ చెయ్యాల్సి ఉండగా, కొంతమంది అడ్డదారుల్లో క్లోజ్ చేస్తున్నారన్నారు. అటువంటి వారిని ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించవద్దని ఏసీపీ తిరుపతిరావుకు సూచించారు. అనధికార నిర్మాణాలను ముందే గుర్తించి నిలుపుదల చేయించాలని, కట్టిన భవనాలు తొలగించేంత వరకు తీసుకురావద్దని ఆదేశించారు. కార్యక్రమంలో టీపీవో బాలరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ దుర్మరణం

తగరపువలస: ఆనందపురం మండలం దుక్కవానిపాలెం టోల్‌ప్లాజ్ సమీపంలోని శ్రీరాం ఆటో మాల్ ఎదురుగా బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రలోని పర్బానీ జిల్లాకు చెందిన నేతాజీ సుభాష్ దోత్(27) అనే వ్యాన్ డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఆనందపురం పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలివి.. పెందుర్తి నుంచి ఆనందపురం వచ్చే జాతీయరహదారిపై ముందు వెళ్తున్న వాహనాన్ని గుజరాత్ నుంచి టిష్యూ పేపర్ లోడుతో వస్తున్న ఐషర్ వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐషర్ వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ ఎస్‌ఐలు సంతోష్, పాపారావు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యులతో పాటు వ్యాన్ లోడ్‌కు చెందిన యాజమాన్యానికి సమాచారం అందించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● పచ్చని పందిరి కాదు .. ప్రమాదానికి ‘ద్వారం’



ఈ ఫొటోలో ఉన్నది ద్వారమూ కాదు.. పందిరీ కాదు. విద్యుత్ తీగలకు పెద్ద ఎత్తున పచ్చని లతలు అల్లేయడంతో ఇలా కనిపిస్తోంది. సాగర్‌నగర్ ప్రధాన రహదారి వద్ద అధికారుల నిర్లక్ష్యానికి సాక్ష్యం ఇది. ఇక్కడ విద్యుత్ వైర్లకు అల్లుకున్న తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. ఈ వైర్ల కింద పలువురు వాహనాలు పార్క్ చేశారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఏ క్షణంలో అయినా ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. అధికారులు చర్యలు తీసుకోకుంటే మూల్యం చెల్లించక తప్పదు. - కొమ్మాది

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 33/11 కేవీ తాళ్లవలస రూరల్ ఫీడర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా గొల్లల తాళ్లవలస, కొంగరాని కళ్లాలు, యాతపేట, తిరుమల విద్యాసంస్థల రోడ్డు, చిన్నిపేట, సుఖీభవ డబుల్ రోడ్డు, లెజెండ్ లే అవుట్, మహిత లే అవుట్, ఒనుం పేట, వలందపేట తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆనందపురం మండలంలో..

వెల్లంకి సబ్‌స్టేషన్ 11 కేవీ బొడ్డపాలెం హెడ్‌క్వార్టర్స్, ఇండస్ట్రియల్ ఫీడర్‌లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ తెలిపారు. ఈ కారణంగా బొడ్డపాలెం జగనన్న కాలనీ, బొడ్డపాలెం ఇండస్ట్రియల్ ఏరియా, బొడ్డపాలెం గ్రామం, వెల్లంకి, గారిపేట, రెల్లిపేట, మన్యాలపేట, అప్పన్న కాలనీ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఎస్‌ఆర్ పురం సబ్‌స్టేషన్, అడవివరం, దబ్బంద 11 కేవీ ఫీడర్‌లోని దబ్బంద, ఎన్‌జీఆర్ పురం హౌసింగ్ కాలనీ, ఏపీ టిడ్కో గృహ, పారిశ్రామిక ప్రాంతాలకు కూడా విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

థియేటర్లలో ఆర్డీవో తనిఖీ

పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉండటంతో ఆగ్రహం


థియేటర్లలో తనిఖీ చేస్తున్న ఆర్డీవో సంగీత్ మాథూర్

తగరపువలస: చిట్టివలస, తగరపువలసలోని నాలుగు సినిమా థియేటర్లలో భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్, తహసీల్దార్ పైల రామారావు బుధవారం తనిఖీలు నిర్వహించారు. థియేటర్ లైసెన్సులు, ఫుడ్ కోర్టులు, సీటింగ్, వాష్‌రూమ్‌లను పరిశీలించారు. నిబంధనల ప్రకారం థియేటర్లు నడుస్తున్నాయా లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా నాలుగు థియేటర్లలోనూ పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉండటం చూసి అసహనం వ్యక్తం చేశారు. ప్రేక్షకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

ప్రమాదకరంగా కొండవాలు ప్రాంతం


లొడగలవానిపాలెంలో ప్రమాదాలు జరుగుతున్న వాలు ప్రాంతం

తగరపువలస: ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీలో కొండవాలు ప్రాంతంలో సరైన రహదారులు, డ్రైనేజీలు లేక అక్కడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మండల తహసీల్దార్ కార్యాలయం వెనుక కాలనీలో ఇళ్ల మధ్య నుంచి వాలు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో గ్రావెల్‌తో కూడిన మార్గంలో తరచూ ద్విచక్రవాహనదారులు బోల్తాపడి గాయాలపాలవుతున్నారు. ఆటోలు, ఇతర వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు అవకాశం లేకుండా పోయింది. అత్యవసర సమయంలో కూడా పంచాయతీలోని చాలామంది కాళ్లీడ్చుకుంటూ వేములవలస లేదా ఆనందపురం పోలీస్ స్టేషన్ మీదుగా జాతీయ రహదారిపైకి చేరుకోవలసి వస్తోంది. పంచాయతీలో, ముఖ్యంగా కొండవాలు ప్రాంతంలో ప్రమాదాలు జరగకుండా రాకపోకలు సాగించేందుకు వసతులు కల్పించాలని అక్కడివారు కోరుతున్నారు.

అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం శేషవస్త్రాలను అందించారు.

ఎవరీ వృద్ధురాలు?


వృద్ధురాలి(క్యాన్ పట్టుకున్న ఆమె)ని తాళ్లవలసలో రెడ్డమ్మకు అప్పగిస్తున్న భీమిలి పోలీసులు


తగరపువలస: ఓ వృద్ధురాలు దారి తప్పి భీమిలి మండలం చేరుకుంది. తాళ్లవలస పంచాయతీ జాతీయ రహదారి పక్కన మంగళవారం రాత్రి ఒక వృద్ధురాలు వర్షంలో తడుస్తూ ఉండటాన్ని స్థానికులు గుర్తించి భీమిలి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు అక్కడికి వెళ్లి ఆమెతో మాట్లాడారు. కానీ ఆమె వివరాలేమీ చెప్పలేకపోయింది. ఆమె చేతిలోని స్టీల్ క్యాన్‌లో అరిసెలు, జంతికలు, ఉల్లిపాయలు గుర్తించి స్థానికంగా ఉన్న సామాజిక కార్యకర్త రెడ్డమ్మ ఇంట్లో ఆశ్రయం కల్పించారు. బుధవారం వేకువజామున నిద్రలేచిన వృద్ధురాలు తనది విజయనగరం జిల్లా కొత్తవలస అని.. కుమారుడు కొట్టాడని, పర్సు పోయిందని.. పండగకు వెళ్లానని పలు రకాలుగా రెడ్డమ్మకు చెప్పి తన ఊరు వెళ్లిపోతానని క్యాన్ తీసుకుని బయల్దేరింది. రెడ్డమ్మ బతిమాలుతూ పోలీసుల సాయంతో ఇంటికి పంపిస్తానని నచ్చజెప్పినా వినకుండా 5 గంటల సమయంలో ఆటో ఎక్కి ఆనందపురం వైపు వెళ్లిపోయింది.

బోరు ప్లాట్‌ఫాం ఇలా.. నీరు పట్టేదెలా?


పాత కొవ్వాడలో పూడుకుపోయిన బోరుబావి ప్లాట్ ఫాం

పద్మనాభం: మండలంలోని పాత కొవ్వాడలో బోరు బావి ప్లాట్‌ఫాం మట్టితో పూడుకుపోయింది. దీంతో ఈ బోరు బావి వద్ద తాగు నీరు పట్టుకోవడానికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రామాలయం సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన ఉన్న ఈ బోరుబావి ప్లాట్‌ఫాం మొత్తం మట్టితో పూడుకుపోయింది. దీంతో వర్షాల సమయంలో ప్లాట్‌ఫాం ప్రాంతం బురదతో చిత్తడిగా తయారవుతోంది. వాడుక నీరు పైకి వెళ్లకుండా, ప్లాట్‌ఫాం వద్ద నిల్వ ఉండిపోతుంది. పాలకులు, అధికారులు స్పందించి బోరు బావి ప్లాట్‌ఫాం వద్ద పూడుకుపోయిన మట్టిని తొలగించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్టీఆర్‌కు నివాళి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సురేఖ

పద్మనాభం: టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతిని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏవో జయ ఉమ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో..

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద బుధవారం మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు జయంతిని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బి.ప్రసాదరావు, డాక్టర్ బి.సహదేవుడు, సిబ్బంది పాల్గొన్నారు.